# వీరయ్య చేసిన నేరం

కథానిక

ఈ సంవత్సరం నాకు హెడ్ కాన్‌స్టేబులుగా ప్రమోషను వచ్చింది. బాగా చదువుకున్న వాణ్ణి అయినా, తక్కువ ఉద్యోగంనుండి యెక్కువ ఉద్యోగంలోకి ప్రమోషను అవుతూ వెళదామని వుద్దేశం. అదీ కాక నేనేం బి.ఏ. లు ఎం.ఏ. లు చదువుకున్న వాణ్ణి కాను. అంతకు తక్కువ చదువుకున్న వాణ్ణే. అయితే బాగా చదువుకున్న వాణ్ణి"—అంటే యిప్పుడు వున్న సబ్ యిన్‌స్పెక్టర్లకన్న యెక్కువ చదువుకున్న వాణ్ణే. ఇంతకీ కాకీదుస్తులు వేసుకుని, ఎర్రటోపీ పెట్టుకుంటే నేనొక అవతారమూర్తి ననిపించు కునేవాణ్ణి. "రక్షకభటత్వం" మూడు మూర్తులా నాలో ప్రతి బింబిస్తూందని నా ముందుగావచ్చి ఎందరో అనేవారు. అయితే అప్పుడు నాకు గలిగిన ఆనందం యింతాఅంతా కాదు. అసలు నేను నల్లగా వుంటానని యెవరూ అసహ్యించు కొనేవారే కారు. ఎలాగయితేనేం, యీ పదవిలో వుండి సంవత్సరకాలంలో సబ్ యిన్‌స్పెక్టరుగా ప్రమోషను పొందుదామని మంచి పట్టుదలగా వుండేది. అంచేత నేను ఎంతో "సిన్సియర్"గా వుండి ఆ యింత లాభాన్ని చేజిక్కించుకుందామని పనిచేస్తూండేవాణ్ణి. అయితే నాతో కాన్‌స్టేబుల్‌గా పనిచేసిన వాళ్ళందరూ నన్ను ఎన్నో విధాల దారి తప్పించడానికి ప్రయత్నించేవారు. అలాగా వాళ్లు నాముందు కొచ్చేసరికి చిరునవ్వుతో సాగనంపేవాణ్ణి. ఆ చిరునవ్వులో వాళ్లని కేళీచేస్తున్నట్లూ ఏదో అమూల్యమైన సందేశాన్నిస్తున్నట్లూ గ్రహించి కొంతకాలం నాతో మాట్లాడ్డం మానేశారు. ఒక కేసులో మా పై అధికార్లక్కూడా నామీద యెంతో కోపం వచ్చి, నన్ను బర్తరఫ్ చేయించే వుద్దేశంతో మా యింట్లో కొంత బంగారం పడేయించారు. ఐతే నాగురించి పెద్ద అధికార్లకి బాగా తెలుసు గనక నన్ను పీసమైనా కదల్పలేకపోయారు వాళ్లు.

వయస్సులో చిన్నవాణ్ణయినా బుద్ధిలో గొప్ప వాణ్ణని ఓనాడు నామీద కక్షవహించిన మాపై అధికారే అన్నాడు.

ఓనాడు మా స్వగ్రామం వెళదామని బుద్ధి పుట్టింది. మా స్టేషన్‌కి మూడు మైళ్ళ దూరంలో వుంది మావూరు. అయితే ఆవూరు వెళ్లి చాలా కాలమయింది. ఇంతకీ హెడ్ కాన్‌స్టేబుల్‌గా ప్రమోషనొచ్చాక వెళ్లలేదు. ఈకాస్త దూరం ఒక గంటసేపులో వెళ్లి మరోగంటసేపులో తిరిగి రావచ్చుగదా అని డ్రెస్‌తోటే వెళ్ళాను. అసలు డ్రెస్‌లో వుంటేనే నాకు అందమూ ఆనందమూను.

మా వూళ్ళోకి ప్రవేశించే సరికి పెద్ద మర్రిచెట్టు అగుపిస్తుంది. ఆ మర్రిచెట్టుకి కాస్తదూరంలో పాతికగజాల దూరంలో మా యిల్లు మర్రిచెట్టు నాకు జ్ఞానం వచ్చిందగ్గరనుండీ అలాగే వున్నది. ఇప్పటిదాకా అందులో ఏమార్పు కనిపించలేదు. ఒక్కొక్కప్పుడు మా తండ్రి కూడా అలాగే అనేవాడు. వాళ్ళ చిన్నతనంలో కూడా అలాగేవుందట. ఎందరో మనుషులు ఆ మర్రినీడని విశ్రమించడం—సాలీలు, మేదర్లు, షరాబులూ—యీ మొదలైన వృత్తులవారందరూ ఆ చెట్టుక్రిందనే తమతమ పనుల్ని నిర్వర్తించుకుంటారు. ఇంకో ప్రక్కగా రెండు వెడల్పయిన పెద్దరాళ్లు-వాటిమీద కూచుని మా వూరి మునసబుగారూ, కరణంగారూ-సమావేశాలు జరుపుతూండడం, తగువులు పరిష్కారం చెయ్యడం జరుగుతూండేవి. ఏదైనా నాటకం, భాగవతం, తోలుబొమ్మలాట, యిలాంటి ప్రదర్శనాలుకూడా ఆ చెట్టుక్రిందనే.

నేను చెట్టుకి కాస్త దూరంలో వుండగానే, మా వూరి మునసబు పలకరించాడు - "ఓహో రంగయ్యా—ఏదో పెద్దపనిమీదనే వచ్చినట్లుంది"

పి. వి. పల్లి

అన్నాడు ముఖం అదోలా పెట్టి. కళ్ళు యెర్రబారేయి.

“ఏంలేదు - చూచిపోదామని—”అన్నాను, ప్రక్కనుండి తప్పుకుని మాయింటివేపు వెళుతూ. మునసబుతో నేను యీ సమాధానం చెప్పి, మా యింటివేపు తిరిగేసరికి నలభయ్యేళ్ళకి పైబడ్డ వ్యక్తి ఒకడు నన్ను చూచి అలాగే నిల్చున్నపాటుగానే ఒణుకుతూ నేల కొరికిపోయాడు. అతన్ని నేను చిన్నతనంలో చూచినట్టు జ్ఞాపకం మూర్ఛవచ్చి అలా పడిపోయాడేమోనని అనుకున్నాను. అతనలా పడిపోగానే అతని తల్లి గాబోలు ఓముసలావిడా, భార్యా యిద్దరూ తిట్టనారంభించారు.

“యెధవ ఎర్రటోపీవోళ్లు-ఆళ్ల మొహం చూడకూడదు...” యిలా పోతూంది ధోరణి. నాకేమీ పాలుపోవడంలేదు. ఆలోచనలోపడ్డాను. ఇంకా అక్కడవుంటే శరీరానిక్కూడా ఏమేనా ప్రమాదమొస్తుందేమోనని యింటికి చేరాను.

మా పెదతల్లి సంబరపడిపోయింది నా రాకకి. మా అమ్మ, నా చిన్నతనంలోనే చచ్చిపోయింది. అప్పటినుండి నన్ను పెంచి పెద్దవాణ్ణిచేసింది మా పెత్తల్లి. అయితే ఉద్యోగంలో వుండడం మూలాన తరుచుగావచ్చి యీమెను చూడ వీలు లేకపోతూండేది. అయినా ఆవిడే నెల్లాళ్ళకో, రెణ్ణెల్లకో నాదగ్గరికి వచ్చేది. ఇప్పటి స్టేషనుకి బదిలీ అయిందని తెలిసాక ఒకసారి వచ్చింది కూడాను.

నాకు యేమీ తోచడంలేదు. మా పెద్దమ్మ ఏవేవో అడుగుతునే వున్నది. తెలియకుండానే ఏవేవో జవాబులు చెపుతున్నాను. టీ యిచ్చింది. నోటిదగ్గర పెట్టుకున్నానన్నమాటేగాని, త్రాగాలనిపించలేదు. “అదేందిరా. త్రాగకుండా అలా చూత్తున్నావ్?” అన్న పెద్దమ్మ మాటలు, నన్ను త్రాగించేయి. నా అనుమానం తీరడానికి మార్గం ఏమీ పాలుపోవడంలేదు. పోనీ పెద్దమ్మకి తెలీదా—అన్న నిబ్బరంతో అడిగాను. “అవును గాని పెద్దమ్మా నేను చెట్టుకిందనుండి వస్తున్నప్పుడు ఎవరో పెద్దమనిషి మూర్ఛవచ్చినట్లు వణుకుతూ నేలకొరిగిపోయాడు-వాడి తల్లీ, భార్యా కాబోలు పోలీసువాళ్ళు మంచివాళ్ళుకారని తిడుతున్నారు. అదంతా యేమిటి?”

“అదంతా ఒక కథలే”అన్నది నిట్టూరుస్తూ.

“చెప్పు”అన్నాను.

చెప్పడం మొదలెట్టింది.

“మన పెదతాతగారి అల్లుడు వీరయ్యానెరగవూ? చిన్నప్పుడు నిన్ను ఎత్తుకుని ముద్దాడేవాడు. వాడే ఆ మనిషి.”

“ఏమిటీ! ఆ వీరయ్యేనా?”

“అవును. నువ్వు వెళ్ళిపోయింతర్వాత వాళ్ళు గూడా యీ వూరువొదిలి వెళ్ళిపోయారు. కాని ఆ పాలెంలో వాళ్ళకి జరక్క కరణంగారింట్లో పాలేరుగా కుదురుకున్నాడు వచ్చి.

“ఆఁ! అయితే?”అన్నాను.

“ఓనాడు ఏంజరిగిందంటే:”

పెద్దమ్మ మొహం నల్లబడిపోయింది. నాకు జాలివేసింది. మళ్ళీచెప్పడం మొదలుపెట్టింది.

“అప్పుడు కంట్రోలు గొడవలు జాస్తీగా వున్నాయి. సోలెడుగింజలన్నా ఎక్కడికీ పట్టుకు వెళ్ళకూడదట. అయినా కరణంగారు చాలా మంచివారుగాబట్టి, పైవూళ్ళనించి మనవూరు బియ్యంతెచ్చి అమ్మేవారు అందరూను. లేకపోతే ఏమైపోదుమో యీపాటికి.”

అసలు విషయం యింకా చెప్పకపోవడం, నాకష్టమనిపించింది. “ఆఁ, అయితే” అన్నాను మళ్ళీ వేగం ఉపోద్ఘాతం తగ్గించెయ్యమన్నట్లుగా.

“ప్రతిసంవత్సరం వూళ్ళోపండినగింజలు పెద్దవాళ్ళు అంతావచ్చి మోసుకుపొయ్యేవాళ్ళు. తినడానికిక్కూడా వుండనిచ్చేవాళ్ళుకారు. అందుకు కోపంరాలేదుగాని, మునసబుగారింట్లో గరిసెల కొద్దీవున్నా, వూరుకొనేవాళ్లు ఆ పెద్దమనుషులు. అంచేత ఓనాడు వీరయ్య ఎవడితోనో అన్నాట్ట, పెద్దోళ్ళయింట్లో వుంటే వూరుకుంటారు. మా బోటి కూలోళ్ళని దాచుకోనివ్వర”ని. ఆ మాట మునసబుచెవిలోపడింది. ఆమట్టున కరణంగారింటికొచ్చి వీరయ్యని పాలేరుగావుంచవద్దనీ, తీసెయ్యమనీ, యీసారి తన వూసెత్తుతె పోలీసువాళ్ళని పిలిపిస్తాననీ, అన్నాట్ట. కరణంగారికి వీరయ్య మీద మంచి దయ. ఆయనవున్నా, లేకపోయినా నమ్మకంగా అన్ని పనులూచేసి పెడుతూండేవాడు. అసలు వీరయ్య పాలేరుగా వచ్చిందగ్గరనుండీ ఆయనపని బాగుందిట. అంచేత పాలేరుని మానిపించనని మునసబుతో గట్టిగా చెప్పా

రట కరణంగారు. ఆయనకిలాంటి దౌర్జన్యాలంటె యిష్టంలేకపోయినా మునసబుగదా అని వూరుకుండేవారు. కాకపోయినా మునసబు తప్పతాగి యింటిమీదికొచ్చి పోలుతూండేవాడు. వాడిరహస్యాల్ని బయటపెడితే ఎంతపనికేనా సెట్టుకుంటాడేమోనని భయం. కాని యిప్పుడు వీరయ్య విషయంలో నిక్కచ్చిగా చెప్పేశారు. వీరయ్యమీద అమ్మగారిక్కూడా అభిమానంవుండేది. ఓమాటు బంగారపు గొలుసు తెగిపోయి నూతిదగ్గర బురదలో దొరికితే అమ్మగారికి పట్టుకెళ్ళి ఇచ్చేశాడు. అప్పటీనుండి వీళ్ళమీద మరీ నమ్మకమూ అభిమానమూ కలిగేయి వాళ్ళకి.

మునసబుకి కరణంగారిమీద మరీకోపం వచ్చి "అయ్యా కరణంగారూ! నామీద కెదురుతిరిగినోణ్ణిమీరు చేరదీస్తున్నారు జాగ్రత్తసుమండీ" అని బెదిరించి పళ్ళు కొరుకుతూ వెళ్లిపోయాడు. అప్పటినుండీ మునసబుగారికీ, కరణంగారికీ దెబ్బలాటలు బయలుదేరుతున్నాయి. కరణంగార్ని యెలాగన్నా సాధించుదామని నిశ్చయించుకున్నారు మునసబుగారు.

వీరయ్యమాత్రం ఎప్పుడూ ధైర్యం చెపుతూవుండేవాడు కరణంగారికి.

ఓనాడు సాయంత్రం దీపాలవేళవుంటుంది. కరణంగారింటిముందు పోలీసోళ్లు పదిపదిహేనుమంది, యింకా మన వూరోళ్లుమూగేరు. ఏంటో అని నేనుకూడా వెళ్ళాను. తీరాచూస్తే వీరయ్యని పోలీసులు పట్టుకుని లెంపలు వాయిస్తున్నారు; ఎందుకో అనుకున్నాను. మునసబుగారు వాడిమీద కేసుపెట్టినాడట, వూళ్ళో ధాన్యం ప్రొక్యూరుమెంటుకి యివ్వకుండా చేస్తున్నాడని.

"నాకు తెలీదు బాబో—"అని వీరయ్య గోలపెడుతున్నా వూరుకోకుండా ముఖంవాచిపోయేట్లుకొట్టి తీసుకుపోయారు. కరణంగారు ఎంతచెప్పినా వినలేదువాళ్లు. మునసబునాయుడు వాళ్ళతో వెళ్ళాడు. ఊరవతల మునసబునాయుడి కళ్ళంలో రాత్రి మకాంవేశారు, చాలసేపు. రెండు గొర్రెపోతుల మాంసం, ఎన్నో సారాసీసాలూ అవన్నీ ఖర్చయినట్లు మర్నాడు చెప్పాడు, వాళ్ళ పాలేరుగావున్న మన సీతయ్య. ఆ అర్థరాత్రి వీరయ్యని పోలీసువాళ్లు తీసుకుపోయారట.

మూడురోజులవరకు వాణ్ణి వొదల్లేదు. ఆ తరవాత వాడు బాగా చిక్కిపోయి, నల్లబారిపోయి వచ్చాడు. ఒంటినిండా దెబ్బలుబాగా అవుపించాయి. రక్తపుచారలు ఎండిపోయి, ఒళ్ళంతా అసహ్యంవేసేటట్లు అయిపోయింది. నెలరోజులదాకా మనిషి లేవలేకపోయాడు.

అప్పటినుండీ వూళ్లోకి ఎవరన్నా పోలీసువాళ్లు వస్తే అలా మూర్ఛపోయినట్టు పడిపోతూంటాడు. బాగా ఒడిలిపోయాడు మనిషి. పెళ్ళాం సీతమ్మ, కూలిచేసి తెచ్చిపెడుతూంటుంది. ఏపనీ చెయ్యలేడు. కరణంగారు అప్పుడప్పుడు ఏమేనా గింజలూ, డబ్బూ యిస్తుంటారు. చూడు నాయనా, పోలీసువాళ్ళూ మునసబుగారూ ఎంతో అన్నదమ్ముల్లా తిరుగుతూంటారు! అసలు వీరయ్య వీధిలోకి రావడమే మానుకున్నాడు."

ముగించింది పెద్దమ్మ కథని. కళ్లంట బొటబొటా కన్నీరు కారింది పెద్దమ్మకి. చూస్తూ అలా వుండిపోయాను.

---

స్కెచ్

# శేషయ్యగారి హాస్యం

కె. రామలక్ష్మి

పార్లమెంటు సభ్యుడు శేషయ్యగారు ప్రజాప్రతినిధుల సభలో నిలువెత్తునా నిలబడి అమరత్వం పొందదగిన ఓ హాస్యపూరితోపన్యాసాన్ని యిచ్చేశాడు. ఆవేళ మీటింగులో ఎక్కువమంది సభ్యులూలేరు-అయినా శేషయ్యగారి "హాస్యం" ఉన్న కొద్దిమందినే ఉత్తేజపరిచింది. ఉపన్యాసం అంతకీ ఏంగాని, ఆయన రాయలసీమవాసుల వివిధముఖాభివర్ణన వినితీరవలసిందే. అనుకోకుండానే ఆయన ఆ ధోరణిలో పడ్డారు. అర్థనిమాలితనేత్రుడైన ఓ సభ్యుడు